సాక్షి
నిజామాబాద్

సోమవారం ၊ 13 ၊ అక్టోబర్ ၊ 2025



జోర్డాన్‌లో వలస కార్మికుల..
జోర్డాన్‌లో వ్యవసాయ పనుల కోసం వలస వెళ్లిన తెలంగాణ జిల్లాల కార్మికులు అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు.
- 8లో ▸



రోడ్లపై ధాన్యం రాశులు..
రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోస్తున్నారు. హైవే 63పై ప్రమాదాలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.1 /17.8

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మబ్బులతో కూడి ఎండ ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళలో ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

ఎప్పుడు కూలుతుందో..



రుద్రూర్‌లోని శ్రీరామ మందిరం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి పడుతుండడంతో ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదకరంగా మారడంతో మూడేళ్ల క్రితమే మెట్లను పూర్తిగా తొలగించారు. – రుద్రూర్



వణికిస్తున్న వంతెన



జిల్లాలోని వేల్పూర్ – మోతె గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన వంతెన కొద్దికొద్దిగా కూలిపోతోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరి అడుగుభాగం ఇప్పటికే కొంతమేర కూలిపోయింది. వంతెన కూలితే ఆర్మూర్, భీమ్‌గల్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని, వెంటనే బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. – వేల్పూర్

న్యూస్‌రీల్

పటాకుల విక్రయానికి అనుమతి తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా పటాకుల దుకాణదారులు తప్పనిసరిగా డివిజన్ స్థాయి పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని సీపీ సాయిచైతన్య ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పటాకులు విక్రయించేందుకు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసే వారు సంబంధిత డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. పటాకుల దుకాణాలను ఖాళీ ప్రదేశాల్లో నెలకొల్పాలని, అనుమతి లేని దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించొద్దని, అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు.

15 నుంచి పశువులకు గాలికుంటు టీకాలు

- జిల్లాకు చేరిన 2 లక్షల డోసులు




డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి తెల్ల, నల్ల జాతి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి తెలిపారు. జిల్లాకు 2 లక్షల డోసులను ప్రభుత్వం సరఫరా చేయగా వచ్చే నెల 14 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలో 2లక్షలకు పైగా పశువులు ఉన్నాయని, ప్రతి ఆరు నెలలకోసారి ఈ టీకాలను తప్పనిసరిగా వేయించాల్సి ఉంటుందన్నారు. పాడి రైతులందరూ ఈ నెల 15నుంచి సమీప పశువైద్య కేంద్రంలో లేదా పశువైద్యులను గ్రామాల్లోకి రప్పించుకుని పశువులకు గాలికుంటు టీకాలను వేయించాలని కోరారు.

థాయ్ బాక్సింగ్‌లో పతకాలు



నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 థాయ్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు వచ్చాయి. ఆదివారం హన్మకొండ జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు నిహారిక, శ్రీవల్లి బంగారు పతకం, కుల్సుం, శ్వేత రజత పతకం, శృతి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా వారిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి అభినందించారు.

‘సాగర్’లోకి 13,662 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం 13,662 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా 13,562 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 (17.8 టీఎంసీలు) అడుగులకు గాను ప్రస్తుతం 1405 (17.8 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

నియామకం



కామారెడ్డి టౌన్: ఆల్ ఇండియా ఫోరమ్ ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సకినాల అనిల్ కుమార్ నియమితులయ్యారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఇటీవల జరిగిన 8వ జాతీయ కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో ఆయనకు చోటు దక్కింది. ఈ మేరకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు అనిల్‌ను అభినందించారు.

బీసీకా.. ఓసీకా..?

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనే అంశంపై సర్వత్రా చర్చసాగుతోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై అందరి దృష్టి ఉన్న ప్రస్తుత తరుణంలో.. పార్టీ పదవుల్లో సైతం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో డీసీసీ పీఠంపై కూర్చునేది బీసీనా..? ఓసీనా..? తేలాల్సి ఉంది. డీసీసీ కోసం 18 మంది దరఖాస్తులు అందజేయగా.. సీసీసీ(సిటీ కాంగ్రెస్ కమిటీ) పదవి కోసం తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు.

- డీసీసీ పీఠం కోసం తీవ్ర పోటీ
- భారీగా అందిన దరఖాస్తులు
- మానాల తరువాత ఎవరో..
- కాంగ్రెస్ పదవులపై సర్వత్రా ఆసక్తి







దరఖాస్తు చేస్తున్న బాడ్సి శేఖర్‌గౌడ్, బాస వేణుగోపాల్‌యాదవ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తరువాత ఆ పీఠం ఎవరికి దక్కుతుందనే అంశంపై చర్చ సాగుతోంది. జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ఆశావహులు ఎవరికి వారు తమ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండడంతోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో డీసీసీ పీఠంపై మరింత ఆసక్తి నెలకొంది. పార్టీ నాయకత్వం ఎంపిక ఎలా ఉంటుందో.. పీసీసీ అధ్యక్షుడి ఆలోచన ఏవిధంగా ఉంటుందనే దానిపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఓ వైపు బీసీ రిజర్వేషన్ల వ్యవహారం నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత దూరం వెళ్లాయి. మరోవైపు పార్టీ పదవుల్లో సైతం బీసీలకు 42 శాతం అవకాశాలు కల్పించనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పీఠం బీసీ నాయకుడికి కేటాయిస్తారా.. ఓసీ నాయకుడికి అప్పగిస్తారా..? అని కార్యకర్తలు, నాయకులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు నిజామాబాద్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం సైతం ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఏఐసీసీ నుంచి వచ్చిన పరిశీలకులు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి వివిధ వర్గాల, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు సేకరించి, దరఖాస్తులు చేసుకున్న నాయకులతో ముఖాముఖి మాట్లాడి పార్టీ నాయకత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ నివేదిక మేరకు డీసీసీ, సీసీసీ అధ్యక్షులను ఎంపిక చేసేందుకు పార్టీ రంగం సిద్ధం చేసింది.

పోటాపోటీగా దరఖాస్తులు

డీసీసీ పీఠం కోసం అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. ఏకంగా 18 మంది తమ దరఖాస్తులను అందించారు. రేసులో యూత్ కాంగ్రెస్ స్థాయి నుంచి అంచెలంచెలుగా పనిచేస్తూ వచ్చిన మార చంద్రమోహన్‌రెడ్డి(ఆర్మూర్), నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి (రూరల్), డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి(రూరల్), పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌కు సన్నిహితుడైన పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్ (రూరల్), పీసీసీ అధికార ప్రతినిధిగా చేసిన సీఎం రేవంత్ సన్నిహితుడు బాస వేణుగోపాల్‌యాదవ్(బాల్కొండ) రేసులో ముందున్నారు.

అదేవిధంగా మహ్మద్ జావెద్ అక్రమ్(అర్బన్), నరాల రత్నాకర్(అర్బన్), గంగాశంకర్(బోధన్), కునిపూరి రాజారెడ్డి(బాన్సువాడ), కోల వెంకటేశ్(ఆర్మూర్), అయ్యప్ప శ్రీనివాస్(ఆర్మూర్), జి.నటరాజ్(అర్బన్), కె.సాయికుమార్(అర్బన్), ముషు పటేల్(అర్బన్), మహ్మద్ ఖరీముద్దీన్(అర్బన్), ఇమ్మడి గోపి(రూరల్), జగడం సుమన్(అర్బన్), ఎంఏ అలీమ్(అర్బన్) దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ముందంజలో ఉన్న బాడ్సి శేఖర్‌గౌడ్‌కు ఆ పదవి దక్కుతుందా.. డీసీసీ పీఠం వస్తుందా అనే ఆసక్తి నెలకొంది.

నగర అధ్యక్ష పీఠం కోసం తొమ్మిది మంది..

నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న కేశ వేణు ‘నుడా’ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. అయితే కేశ వేణు డీసీసీ, సీసీసీ పీఠాల్లో దేనికీ దరఖాస్తు చేయలేదు. వేణు తరువాత నగర కాంగ్రెస్ పీఠం ఎవరికనే విషయమై చర్చ నడుస్తోంది. ఈ పదవి కోసం సైతం పోటీ గట్టిగానే ఉంది. కీలకమైన నగర అధ్యక్ష పదవి కోసం సయ్యద్ ఖైసర్ మైనారిటీ కోటా నుంచి రేసులో ముందున్నారు. మరోవైపు డీసీసీకి దరఖాస్తు చేసుకున్న నరాల రత్నాకర్, మహ్మద్ జావెద్ అక్రమ్ సైతం సీసీసీ రేసులోకి వచ్చారు. మరోవైపు పంచరెడ్డి చరణ్, బొబ్బిలి రామకృష్ణ, కాఫ్‌కార్ గస్ రాజ్, శరత్‌కుమార్, మహ్మద్ కరీముద్దీన్, అంతిరెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

పకడ్బందీగా స్త్రీనిధి రుణాలు

- పక్కదారి పట్టకుండా సాంకేతిక విధానం
- లబ్ధిదారుల ఫేస్ క్యాప్చరింగ్, బయోమెట్రిక్ తప్పనిసరి



ఎస్‌హెచ్‌జీ సభ్యురాలి ఫేస్‌ను క్యాప్చర్ చేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ రమేశ్

డొంకేశ్వర్(ఆర్మూర్) : స్త్రీనిధి రుణాల పంపిణీ ప్రక్రియలో ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. రుణాలు పక్కదారి పట్టకుండా లబ్ధిదారుల అనుమతి, సమ్మతి తప్పనిసరి చేసింది. అంతే కాకుండా ఎస్‌హెచ్‌జీ సభ్యురాలి ఫేస్ క్యాప్చరింగ్, బయోమెట్రిక్ తీసుకున్న తర్వాతే రుణం మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త సాంకేతిక విధానం సత్ఫలితాలనిస్తోంది. తద్వారా స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టే అవకాశం లేకుండాపోయింది. జిల్లాలో 806 గ్రామ సంఘాలు, వీటి పరిధిలో 24,179 మహిళా సంఘాలు ఉండగా 2.53 లక్షలకు పైగా సభ్యులు ఉన్నారు. అయితే సంఘాల్లో ఉన్న పేద మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వివిధ వ్యాపారాలు, వ్యక్తిగతంగా స్త్రీనిధి పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు అందిస్తోంది. రూ.50వేల నుంచి మొదలుకొని రూ.5 లక్షల దాకా రుణాలు పొందే అవకాశం కల్పించింది. కిరాణం, బట్టల దుకాణం, జనరల్ స్టోర్, టైలరింగ్, బ్యూటీ పార్లర్, పేపర్ ప్లేట్స్, జూట్ బ్యాగ్స్ తయారీ, ఇంటర్నెట్ సెంటర్, నాటు కోళ్లు, పెరటి కోళ్ల పెంపకం, ఎలక్ట్రికల్ బైక్స్, ఈ–ఆటోలు తదితర వ్యాపారాలు చేసేందుకు రుణాలు అందజేస్తున్నారు. స్త్రీనిధి రుణం కావాలంటే లబ్ధిదారుల లైవ్ ఫొటో, వేలిముద్రలు, ఆధార్, ఫోన్ నంబర్ వంటి వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేస్తున్నారు. కాగా సంఘంలోని ఇద్దరు లీడర్ల ఫొటోలను సైతం తీసుకుంటున్నారు.

ఇప్పటివరకు రూ.111కోట్ల రుణాలు పంపిణీ

గతేడాది జిల్లాలో రూ.211 కోట్లు రుణాలు పంపిణీ చేయగా, ఈ ఏడాది రూ.246 కోట్ల పంపిణీ లక్ష్యంగా నిర్దేశించారు. ఇది రాష్ట్రంలోనే అత్యధిక లక్ష్యం. అయితే ఇప్పటి వరకు 653 గ్రామ సంఘాల పరిధిలో 12,927 మంది మహిళలకు రూ.111 కోట్ల రుణాలను అందజేశారు. మిగిలిన లక్ష్యాన్ని 2026 మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

పారదర్శకంగా రుణాలు



ప్రభుత్వం తెచ్చిన సాంకేతిక విధానంతో పారదర్శకంగా రుణాలు పంపిణీ చేస్తున్నాం. జిల్లాకు నిర్దేశించిన రుణ పంపిణీ లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. రోజుకు రూ.1.50 కోట్ల రుణాలను ఎస్‌హెచ్‌జీలకు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకుని క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పని చేస్తున్నాం.

– రాందాస్, స్త్రీనిధి ఆర్‌ఎం, నిజామాబాద్

మాలల రిజర్వేషన్ల సాధనే ధ్యేయం




సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

- మంత్రి పదవిపై ఆశ లేదు
- ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

నిజామాబాద్ నాగారం: తనకు మంత్రి పదవిపై ఆశ లేదని, మాల జాతి ఐక్యత, రిజర్వేషన్లు సాధించడమే ప్రధాన ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ దృష్టికి తీసుకువెళ్లి మాలలకు 12 శాతం నుంచి 18 శాతం వరకు రిజర్వేషన్ కేటాయించేలా కృషి చేస్తానని తెలిపారు. నగరంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో దివంగత వెంకటస్వామి (కాక) జయంతి వేడుకలు, మాలల ఐక్య సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వివేక్ మాట్లాడారు. మాలలంతా ఏకతాటిపై నిలబడి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ మాలల ఐక్యతను చూస్తే సంతోషంగా ఉందన్నారు. కొందరు ఉన్నత వర్గాల ఉద్యోగులు ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేసే మాల ఉద్యోగులను తొలగించడం, బదిలీ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మాలలు ఐక్యతతోనే కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. మాలలకు వర్గీకరణ విషయంలో అన్యాయం జరిగిందని, దానిపై నిరంతరం పోరాడుతున్నామని వర్ధన్నపేట్ ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. తమ పోరాటానికి అన్ని కులసంఘాలు సహకరించాలని కోరారు. రాజకీయాల్లో సైతం కులవివక్ష కొనసాగుతుందని తెలిపారు. అనంతరం గ్రూప్–1, గ్రూప్–2లో విజయం సాధించిన అభ్యర్థులను సన్మానించారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశం, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆలుక కిషన్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కం దేవదాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు అతిథులు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన బాతులు రెంజల్ మండలం సాటాపూర్ ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో సందడి చేస్తున్నాయి. నెల్లూరు నుంచి వచ్చిన ఈ అతిథులు.. వరి కోతల తరువాత వ్యవసాయభూమిలో రాలిన ధాన్యం గింజలు, కలుపు మొక్కలు కీటకాలను ఆరగించి వచ్చే పంటకు చీడపీడల బెడద లేకుండా చేస్తున్నాయి. బాతుల రెట్ట సహజ ఎరువుగా పని చేయడంతో ఏడాదిలో రెండుసార్లు వలస వచ్చే బాతుల గుంపులను ఇక్కడి రైతులు ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది కూడా వచ్చిన సుమారు 15 కుటుంబాలు సాటాపూర్ ప్రాంతంలో రోడ్ల వెంబడి గుడారాలు వేసుకున్నారు. పొద్దంతా బాతుల గుంపులను వ్యవసాయభూముల్లో మేతకు వదులుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నెట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం..

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన నెట్‌బాల్ టోర్నీలో భాగంగా బాలికల జూనియర్ విభాగంలో జిల్లా జట్టు కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా నెట్‌బాల్ క్రీడాకారులను జిల్లా కార్యదర్శి వెంకట్ ప్రత్యేకంగా అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జట్టు సభ్యులు

కుండీల్లో మిగిలింది సగమే..

- నగం చేప పిల్లలు మృత్యువాత
- 80 రోజులు దాటినా పంపిణీకి నోచుకోని వైనం



చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేపపిల్లలను నిల్వ ఉంచిన నర్సరీలు

బాల్కొండ : ఎస్సారెస్పీ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి చేసిన చేప పిల్లలు 80 రోజులు దాటినా పంపిణీకి నోచుకోలేదు. ఫలితంగా చేప పిల్లలు మృత్యువాత పడుతున్నాయి. సాధారణంగా ఉత్పత్తి చేసిన 40 నుంచి 45 రోజుల్లోనే చేపపిల్లలను పంపిణీ చేయాలి. కానీ, ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు పిలిచిన టెండర్లు ఇప్పటికీ ఖరారు కాలేదు. దీంతో పంపిణీ ప్రారంభించలేదు. ఆ ప్రభావం చేపపిల్లల పెంపకంపై పడింది. 54 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేస్తే ప్రస్తుతం 25 లక్షల చేప పిల్లలు మాత్రమే ఉన్నాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

మరికొన్ని రోజులు గడిస్తే మరిన్ని చేపపిల్లలు మృత్యువాత పడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సైజ్ ఎక్కువగా పెరగడంతో అన్ని చేప పిల్లలకు నర్సరీలో కావాల్సిన ఆక్సిజన్ అందక చనిపోతాయని పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చేప పిల్లల పంపిణీ ప్రారంభించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు లేఖ రాశాం

చేప పిల్లల పంపిణీ కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. చేపపిల్లలు కుండీల్లోనే చనిపోతున్నాయి. ఈ విషయాన్ని సైతం ఉన్నతాధికారులకు వివరించాం. టెండర్లు పూర్తయ్యాక పంపిణీ చేసే అవకాశం ఉంది.

– దామోదర్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్

క్లుప్తంగా

ఆటోలను జాగ్రత్తగా నడపాలి



ఎల్లారెడ్డి: ఆటోడ్రైవర్లు తమ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఎస్సై మహేశ్‌ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్‌ నిర్వహించారు. ఆటోడ్రైవర్లు వారి వెంట ఆర్సీ, డ్రైవింగ్‌ లైసెన్సు ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని అన్నారు.

బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా తుల శ్రీధర్‌

బాన్సువాడ: బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా తుల శ్రీధర్‌ బదిలీపై వచ్చారు. బాన్సువాడలో ఇదివరకు సీఐగా పని చేసిన మండల అశోక్‌ను ఐజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. మల్టీజోన్‌లో భాగంగా పీసీఆర్‌ కామారెడ్డిలో పని చేసిన తుల శ్రీధర్‌ను బాన్సువాడకు బదిలీ చేశారు. బాన్సువాడకు బదిలీౖెన శ్రీధర్‌ నేడు బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ఎల్లారెడ్డిరూరల్‌: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై మహేశ్‌ సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. బైక్‌ నడిపే వారు హెల్మెట్‌, కారు నడిపేవారు సీట్‌ బెల్ట్‌ ధరించాలని సూచించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

భర్తపై పోలీసులకు ఫిర్యాదు



భిక్కనూరు: తనతో పాటు పిల్లలపై దాడిచేసి పారిపోయిన భర్తపై చర్యలు తీసుకోవాలని పిట్ల ప్రియాంక అనే మహిళ భిక్కనూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాచాపూర్‌ గ్రామానికి చెందిన ప్రియాంక వివాహం దోమకొండ మండలం గోపాలపల్లి గ్రామానికి చెందిన పిట్ల భాస్కర్‌తో ఆరేళ్ల క్రితం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రియాంక ఇటీవల తన పుట్టినిల్లు అయిన కాచాపూర్‌కు రాగా భర్త భాస్కర్‌ గ్రామానికి వచ్చి ప్రియాంకతో పాటు పిల్లలపై దాడి చేసి పరారయ్యాడు. తమపై దాడి చేసి పరారైన భర్త భాస్కర్‌పై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వలస కార్మికుల ఆకలి కేకలు

- జోర్డాన్‌లో ఉపాధి కోసం వెళ్లి సరైన తిండి లేక అనారోగ్యం పాలు
- ఇంటికి వెళ్తామంటే పోలీసులతో బెదిరిస్తున్న యజమానులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని వలస కార్మికుల వినతి


జోర్డాన్‌లో చిక్కుకున్న వలస కార్మికులు

మోర్తాడ్‌(బాల్కొండ): దేశంకాని దేశంలో సరైన తిండి లేక ఆకలితో అలమటిస్తున్న వలస కార్మికుల దయనీయమైన పరిస్థితి అందరి కంట కన్నీరు పెట్టిస్తోంది. జోర్డాన్‌లో వ్యవసాయ పనుల కోసం ఏడాది కింద వలస వెళ్లిన తెలంగాణ జిల్లాల కార్మికులు అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడ ఉండలేమని తాము ఇంటికి వెళతామంటే అక్కడి యజమానులు నిరాకరిస్తున్నారు. ప్రశ్నించిన వారిని పోలీసులతో బెదిరింపులకు గురి చేస్తున్నారని వలస కార్మికులు వాపోతున్నారు. నిజామాబాద్‌, కామారెడ్డి, జగిత్యాల్‌, నిర్మల్‌ జిల్లాలకు చెందిన 12 మంది వలస కార్మికులు జోర్డాన్‌లో ఉన్నారు. వ్యవసాయ పనులు చేయడానికి తమను తరలించగా జీతం ఒప్పందం ప్రకారం చెల్లిస్తున్నా సరైన భోజనం లేకపోవడంతో ఆకలి బాధ తట్టుకోలేక పోతున్నామని వలస కార్మికులు చెబుతున్నారు. మూడు పూటలా భోజనం పెడుతున్నా అది కేవలం 10 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారికి సరిపోయేంతనే ఉంటుందని కార్మికులు ‘సాక్షి’కి ఫోన్‌లో చెప్పారు. తాము చేస్తున్న పనికి సరైన ఆహారం లేకపోవడంతో తమలో ఒకరైన నిజామాబాద్‌ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన కత్తి నరేశ్‌ అనారోగ్యం పాలైతే ఇటీవలే ఇంటికి పంపించామని వెల్లడించారు. తాము జోర్డాన్‌ వచ్చిన నుంచి వారంలో ఆరు రోజుల పాటు ఆలుగడ్డ కూరతోనే భోజనం పెడుతున్నారని తెలిపారు. ఒకరోజు మాత్రం చికెన్‌ పెడుతున్నా అది కూడా ఉడికీ ఉడకుండా ఉంటుండటంతో తినలేకపోతున్నామన్నారు. ఇప్పటికే తమ కష్టాలపై సామాజిక మాధ్యమాల ద్వారా వలస కార్మికులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఇంటికి పంపించాలని కోరితే యజమానులు అంగీకరించడం లేదని ఎంబసీలో ఫిర్యాదు చేస్తే అధికారులు వచ్చి వివరాలను నమోదు చేసుకున్నారని వలస కార్మికులు తెలిపారు. తమను ఇంటికి రప్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని వలస కార్మికులు వేడుకుంటున్నారు.

విదేశాంగ శాఖకు లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం

జోర్డాన్‌లో ఉన్న తెలంగాణ వలస కార్మికులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం శనివారం అమ్మాన్‌లోని భారతదేశ రాయబార కార్యాలయానికి, విదేశాంగ శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు లేఖ పంపించారు. 12 మంది వలస కార్మికుల పేర్లు వారి పాస్‌పోర్టు నంబర్లు, మొబైల్‌ నంబర్లతో సహా ఇతర వివరాలను అందించారు. విదేశాంగ శాఖ సత్వరమే స్పందించి జోర్డాన్‌లో ఉన్న వలస కార్మికులను రప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

అనవసరపు కాల్స్‌ వేధిస్తున్నాయా..?

మీకోసం..



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మీరు అత్యవసర పనుల్లో, ఇతరులతో సమావేశాల్లో ఉన్నప్పుడు ప్రమోషనల్‌, మార్కెటింగ్‌ కాల్స్‌ వస్తుంటాయి. ఈ అనవసరపు ఫోన్‌కాల్స్‌ రోజు ఇబ్బంది పెడుతున్నాయా... అయితే ఫోన్‌లో పలు మార్పులతో కట్టడి చేయొచ్చు. యాక్టివేట్‌ డీఎన్డీ ప్రమోషనల్‌, మార్కెటింగ్‌ ఫోన్‌ కాల్స్‌ రాకుండా ఉండాలంటే మొదట ఫోన్‌లో డీఎన్డీ ఆప్షన్‌ను ఎనేబుల్‌ చేయాలి.

- STARTO అని టైప్‌ చేసి.. 1909కి ఎస్‌ఎంఎస్‌ చేస్తే ప్రమోషనల్‌ కాల్స్‌ ఆగిపోతాయి. వెబ్‌సైట్‌ https:/// www. dndcheck. co. in లోకి వెళ్లి ‘నేషనల్‌ డునాట్‌ కాల్‌ రిజిస్ట్రీ’లో ప్రమోషనల్‌ కాల్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చు. టెలికాం ప్రొవైడర్లందరికీ.. అధికారిక యాప్‌ ఉంటుంది.(ఉదాహరణకు మై జియో, ఎయిర్‌టెల్‌ థ్యాంక్స్‌, వీఐ యాప్‌). అందులో డీఎన్డీ సెట్టింగ్‌లోకి వెళ్లి ప్రిఫరెన్స్‌ ఎంపిక చేసుకొని ప్రమోషనల్‌ కాల్స్‌ బ్లాక్‌ చేయొచ్చు.
- బ్యాంక్‌ వెబ్‌సైట్‌ లేదా యాప్‌లో లాగిన్‌ అయ్యి.. కమ్యూనికేషన్‌ ప్రిఫరెన్సెస్‌ లేదా ప్రొఫైల్‌ సెట్టింగ్స్‌లోకి వెళ్లి మార్కెటింగ్‌, ప్రమోషనల్‌ ఈ మెయిల్స్‌, ఎస్‌ఎంఎస్‌, కాల్స్‌ ఆప్షన్‌ డిజేబుల్‌ చేయడం ద్వారా అనవసరపు ఫోన్‌కాల్స్‌ను తగ్గించుకోవచ్చు.

మాన్యువల్‌ నంబర్‌ బ్లాకింగ్‌..

డీఎన్డీ సెట్టింగ్‌ను యాక్టివేట్‌ చేసినా అనవసరమైన ఫోన్లు వస్తే ఫోన్‌లోని కాల్‌ బ్లాకింగ్‌ ఫీచర్‌ను ఉపయోగించి అడ్డుకట్ట వేయొచ్చు. ట్రూ కాలర్‌, కాల్‌ బ్లాకర్‌ లాంటి యాప్‌లు కూడా ఉన్నాయి. అవి స్పామ్‌, బ్యాంక్‌, మార్కెటింగ్‌ ఫోన్‌కాల్స్‌ను గుర్తిస్తాయి. ఒకసారి కాల్‌ వచ్చినప్పుడు ‘మార్క్‌ కాల్స్‌ యాజ్‌ స్పామ్‌’ ఆప్షన్‌ ఎంచుకుంటే ..ఆ తర్వాతి నుంచి ఆయా నంబర్ల నుంచి కాల్స్‌ రావు.

నేరుగా బ్యాంకుకే..

ఒకే బ్యాంక్‌కు చెందిన మార్కెటింగ్‌ సిబ్బంది నుంచి తరచూ కాల్స్‌ వస్తుంటే.. ఆ బ్యాంక్‌ కస్టమర్‌ కేర్‌ సర్వీసుకు కాల్‌ చేసి.. లేదంటే నేరుగా బ్రాంచ్‌కి వెళ్లి ‘అప్డేట్‌ యువర్‌ ప్రిఫరెన్సెస్‌’ను మార్చాలని కోరాలి. గతంలో మీరు ‘మార్కెటింగ్‌ కమ్యూనికేషన్‌’కు అంగీకారం తెలిపినట్లయితే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు కచ్చితంగా చెప్పాలి.

డీఎన్డీ ఆప్షన్‌ యాక్టివేట్‌ చేసినా..

కాల్స్‌ వస్తుంటే.. నేరుగా 1909కి ఫోన్‌ చేసి.. ఫిర్యాదు చేయొచ్చు. https:/// www. nccptrai. gov. in ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయొచ్చు.

దారిపైనే ధాన్యం రాశులు

- వాహనదారుల తిప్పలు
- కల్లాలు లేక ధాన్యం ఆరబోతకు రైతుల ఇబ్బందులు


బోర్గాం-శాంతినగర్‌ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం


చిన్నాపూర్‌ రహదారిపై ధాన్యం ఆరబెట్టిన చోట రేడియం ఏర్పాటు చేస్తున్న మాక్లూర్‌ పోలీసులు

మాక్లూర్‌: పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోడానికి కల్లాలు లేక ప్రతి ఏడాది రైతులు జాతీయ, గ్రామీణ రోడ్లనే ఆశ్రయిస్తున్నారు. ప్రధాన రహదారులపై ధాన్యం రాశులు పోయడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. జిల్లాలో వరికోతలు ప్రారంభం కావడంతో మాక్లూర్‌ మండలంలోని రైతులు ప్రధాన రహదారులపై వరి ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. రహదారులతో పాటు సర్వీస్‌ రోడ్లపైనా ధాన్యాన్ని ఆరబెడుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రులు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు ఆస్పత్రులకు చేరిన ఘటనలు ఉన్నాయి. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దని పోలీసులు రైతులకు సూచిస్తున్నా స్పందన కరువవుతోంది. ఇటీవల మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌ చిన్నాపూర్‌ గండి ప్రాంతంలోని 63వ నంబర్‌ జాతీయ రహదారిపై రైతులు ఆరబోసిన ధాన్యం రాశుల గుండా సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా రేడియం స్టిక్లర్లను ఏర్పాటు చేశారు. మాణిక్‌బండార్‌ నుంచి బోర్గాం(కె) ద్వారా నందిపేట వెళ్లే రహదారికి పొడవున రోడ్డంతా ధాన్యం ఆరబెడుతున్నారు. గడిచిన రెండేళ్లలో నవీపేట మండలం లింగాపూర్‌కు చెందిన గంగాధర్‌ అనే వ్యక్తి బోర్గాం వద్ద రోడ్డుపై ఆరబెట్టిన వడ్లకుప్పను ఢీకొని కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ముల్లంగి(బి) గ్రామ శివారులో ఆరబెట్టిన వడ్లపై కారు అదుపు తప్పి బోల్తా కొట్టగా కారు యజమాని తీవ్రగాయాలపాలయ్యాడు. గతేడాది చిన్నాపూర్‌ గండిలో ఒకరు ఆరబెట్టిన వడ్ల కుప్పను ఢీకొని మృతిచెందాడు. ఇలా ప్రతి సీజన్‌లో రోడ్లపై ఆరబెడుతున్న వడ్ల కుప్పలను ఢీకొని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయొద్దు



మండలంలోని రైతులు తమ పంట ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టవద్దు. రాత్రుళ్లు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని గమనించక పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా రైతులు మైదానాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి. – రాజశేఖర్‌, ఎస్సై, మాక్లూర్‌

గత్యంతరం లేక రోడ్లపై..



ధాన్యాన్ని ఆరబోసేందుకు కల్లాలు లేక గత్యంతరం లేక కోసిన పంటను రోడ్లపై ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మైదాన ప్రాంతాలు లేవు. వాహనదారులు సైతం రైతుల ఇబ్బందులను గుర్తించాలి. – గొల్ల లక్ష్మణ్‌, రైతు, వల్లభాపూర్‌

విద్యార్థులకు దీన్‌దయాల్‌ స్పర్శ్‌యోజన పోటీలు


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిరికొండ: మండలంలోని సత్యశోధక్‌ పాఠశాలలో ఆదివారం తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్‌దయాల్‌ స్పర్శ్‌ యోజన రాష్ట్రస్థాయి జనరల్‌ నాలెడ్జ్‌ పోటీ పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్‌ సబ్‌ డివిజన్‌ తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు సుష్మితాబెనర్జీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోస్టల్‌ పిలాటలి అకౌంట్‌ ఉన్న ఆరు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది పోటీ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులలో తపాలాశాఖపైన అవగాహన, స్టాంపుల సేకరణ అలవాటును పెంపొందించి విజేతలైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులకు తపాలా శాఖ తరపున పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ప్రిన్సిపాల్‌ నర్సయ్య, సబ్‌ పోస్ట్‌ మాస్టర్లు మహేందర్‌, రాజ్‌కుమార్‌, వెంకటదాస్‌, గోపాల్‌, స్నేహిత్‌, ప్రవీణ్‌, లింగం, గంగారెడ్డి, రాజు, శంకర్‌, రవి, శ్రీధర్‌ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి రోడ్డు



రామారెడ్డి: రామారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్లే మార్గంలోని గంగమ్మ వాగు బ్రిడ్జి వద్ద ఏర్పడిన పెద్ద గుంతతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, బైక్‌లు ప్రయాణం సాగిస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చీకట్లో కొత్తగా వచ్చే వారు ప్రమాదానికి గురికావడం తప్పదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

డొంకేశ్వర్‌లో కోతుల బెడద


తహసీల్‌ కార్యాలయ ప్రహరీపై కూర్చున్న కోతులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండల కేంద్రంలో కోతుల బెడద పెరిగిపోయింది. ఇళ్లపైకి చేరి పెంకులను తొలగిస్తున్నాయి. తహసీల్‌, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు ఆలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్థానిక ప్రభుత్వ పాఠశాలల చెట్లపై కోతులు మందలుగా సంచరిస్తున్నాయి. దీంతో ఇళ్లలో ఉండే, ఆఫీసులకు వచ్చే ప్రజలతో పాటు పాఠశాలకు వచ్చే విద్యార్థులు కోతులు ఎక్కడ దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోతులను పట్టుకెళ్లాలని మండల వాసులు కోరుతున్నారు.

వీరవనితల ధైర్యసాహసాలు వివరించాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

- రాష్ట్రీయ సేవికా సమితి విజయదశమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్‌: దేశ పునర్నిర్మాణంలో మహిళాశక్తి అనిర్వచనీయమైందని, ఎందరో వీర వనితలు దేశం కోసం త్యాగం చేశారని రాష్ట్రీయ సేవికా సమితి తెలంగాణ ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్‌లో రాష్ట్రీయ సేవికా సమితి విజయదశమి ఉత్సవం, 282 మంది సేవికలు ఘోష్‌తోపాటు పదసంచలనం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తగా హాజరై శ్రీపాద రాధ మాట్లాడారు. అతిథిగా విశ్రాంత వైద్యురాలు ఉమాజనార్దన్‌ పాల్గొన్నారు. ప్రతి కుటుంబంలో తమ పిల్లలకు దేశ వీరవనితలు, సంఘ సంస్కర్తల పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలను వివరించాలని శ్రీపాద రాధ అన్నారు. హిందూ సామ్రాజ్యం స్థాపించడానికి శివాజీ తల్లి జిజియాబాయి చేసిన కృషిని చెప్పాలన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, రాణి అహల్యాబాయి హోల్కర్‌లాంటి వారు దేశం, సంస్కృతి సంప్రదాయాల కోసం చేసిన కృషి, సేవలను వివరించారు. కార్యక్రమంలో విభాగ్‌ కార్యవాహిక గుజరాతి సరోజ, జిల్లా కార్యవాహిక వీరమల్లి సరస్వతి, ప్రతినిధులు యజ్ఞశ్రీ, రాణి, బొంతపల్లి కల్పన, అనిత తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి 1998-99 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు, విశ్వశాంతి హైస్కూల్‌ 2007-08 బ్యాచ్‌ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న ముప్కాల్‌ ఉన్నత పాఠశాల పదోతరగతి 2003-04 బ్యాచ్‌ విద్యార్థులు

మోపాల్‌/ ఖలీల్‌వాడి/ మోర్తాడ్‌/ బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్‌/ సదాశివనగర్‌: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత విద్యార్థులంతా ఒకే వేదికపై కలవడంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్‌, రాజు, నరేందర్‌, శ్రీహరి, లత, ఉమా మహేశ్వరి, దొంతుల రవి, కవిత, కల్పన, సుకన్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పద్మనగర్‌లో ఉన్న శ్రీ విశ్వశాంతి హైస్కూల్‌లో 2007–2008లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిదాస్‌, అరుణ, అనిల్‌, రాజేశ్‌, రాజేందర్‌, సుజాత, థామస్‌, ప్రసన్న, పాండు, గణేశ్‌, మురళి పాల్గొన్నారు. మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, ముప్కాల్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆర్మూర్‌ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 2005–06 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు జయలక్ష్మి, లావణ్య, స్వాతి, శిల్ప, శ్రావణి, లక్ష్మి, ప్రియాంక, సునీత, భాను తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌ మండలంలోని పద్మాజివాడి ఉన్నత పాఠశాలలో 2008–09 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు వీవీ రమణ, అబ్బయ్య, వాణి, లింగం, మీనా, సవిత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


పద్మాజివాడి ఉన్నత పాఠశాల పదోతరగతి 2008-09 బ్యాచ్‌ విద్యార్థులు


తిమ్మాపూర్‌ ఉన్నత పాఠశాల పదో తరగతి 1999-2000 బ్యాచ్‌ విద్యార్థులు


ఆర్మూర్‌ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి 2005-06 బ్యాచ్‌ విద్యార్థులు

బైక్‌, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

నిజామాబాద్‌ అర్బన్‌: నగరంలోని కోర్టు చౌరస్తాలో ఆదివారం బైక్‌, ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోర్టు చౌరస్తాలో వేగంగా వస్తున్న బైకు ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్‌ పోలీసులు తెలిపారు.

మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ సీజ్‌

తాడ్వాయి: అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ను సీజ్‌ చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. శనివారం తాడ్వాయి మండలంలోని జంగల్‌దేవి మైనింగ్‌ గుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ, టిప్పర్‌తో మొరంను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. జేసీబీ, టిప్పర్‌ను సీజ్‌ చేసి డైవర్లు లక్ష్మణ్‌, హరీశ్‌గౌడ్‌పై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్రైం కార్నర్‌

రైల్వే పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

నిజామాబాద్‌ సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ ప్లాట్‌ఫారాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆర్‌పీఎస్‌ ఎస్సై తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా ప్లాట్‌ఫారమ్‌–1 వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గంగాప్రసాద్‌ విశ్వంభర గైక్వాడ్‌, అమోల్‌ విశ్వంభర గైక్వాడ్‌ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు పాత నేరస్తులుగా గుర్తించారు. వీరు మహారాష్ట్రలోని నాందేడ్‌ ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. కూలీ పనులు చేసేవీరు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. అంతేకాకుండా గతంలో పలు నేరాలు చేసినట్లు వారు ఒప్పుకున్నారు. వీరి నుంచి విలువైన ఫోన్లు, రూ.18,700 నగదును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చనున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

దుబాయిలో అయిలాపూర్‌ వాసి ఆత్మహత్య


సంగమేశ్వర్‌(ఫైల్‌)

లింగంపేట: మండలంలోని అయిలాపూర్‌ గ్రామానికి చెందిన మన్నె సంగమేశ్వర్‌(27) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం తాను ఉండే ప్రాంతంలోని బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. సంగమేశ్వర్‌ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

నిజామాబాద్‌ అర్బన్‌: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు మూడో టౌన్‌ ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని శివాజీచౌక్‌ నుంచి దుబ్బవైపు వస్తున్న ప్రశాంత్‌, సందీప్‌ అనే యువకులు శనివారం రాత్రి గుర్బాబాది రోడ్డులో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ప్రశాంత్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సందీప్‌ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటమునిగి మత్స్యకారుడి మృతి

ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని రుద్రారం శివారులో ఉన్న నిజాంసాగర్‌ బ్యాక్‌ వాటర్‌లో మునిగి మత్స్యకారుడు మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మల్కాపూర్‌ గ్రామానికి చెందిన కొండ సంగయ్య(52) అనే మత్స్యకారుడు నిజాంసాగర్‌ బ్యాక్‌ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్‌: ఆలూర్‌ మండలం మిర్దాపల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ ఆదివారం పేర్కొన్నారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ. 48,800 నగదు, రెండు బైక్‌లు, ఒక కారు, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

జోరందుకున్న పంట కోతలు

- కల్లాల్లో శ్రమిస్తున్న రైతులు


డొంకేశ్వర్‌లో సోయా పంటను కోస్తున్న హార్వెస్టర్‌


తొండాకూర్‌లో మక్క దిగుబడులను కుప్పగా పోస్తున్న దృశ్యం

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): వర్షాల తగ్గుముఖం పట్టి నేల గట్టిపడడంతో జిల్లా వ్యాప్తంగా పంట కోతలు ఊపందుకున్నాయి. సోయా, మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. దీంతో హార్వెస్టర్లకు గిరాకీ పెరిగింది. మొక్కజొన్న కోతకు గంటకు రూ.4వేలు, సోయాకు రూ.2,600 వరకు రైతుల వద్ద కిరాయి తీసుకుంటున్నారు. పంట దిగుబడులను నేరుగా ట్రాక్టర్లలో తీసుకొచ్చి కల్లాలు, రోడ్లపై ఎండబోస్తున్నారు. పంటను త్వరగా అమ్ముకునేందుకు రైతులు కల్లాల వద్దే తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇంకా మక్క, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని చోట్ల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా కేంద్రాలను తెరవాలని రైతులు కోరుతున్నారు.